


# బతికించారు

వీథిలోంచి వచ్చి మంచంకింద దాక్కున్నాడు రవి.

క్రికెట్‌బాట్ పక్కలో పెట్టుకుని నేల మీదే పడుకున్నాడు.

అది పందిరి మంచం. ఎత్తుగా, వెడల్పుగా ఉంది. రెండు పక్కల గోడకానుకుంది మంచం. ఒకపక్క కిటికీ, గోడవార పడుకున్నాడు రవి.

దుఃఖం ఆగటంలేదు. పెదాలు కొరుక్కుంటూ ఉన్నాడు. ఏడుపు ఆగదు. శబ్దం రారాదు.

నిండులారీ పోతుంటే ఊగే బ్రిడ్జిలాగా ఒళ్లంతా వణికిపోతూ ఉంది.

కన్నీళ్లతో ముఖం తడిసిపోయింది.

ఎండాకాలం మిట్టమధ్యాహ్నం మంచం కింద గాలి ఆడటంలేదు. ఇటు చెమట, అటు కన్నీరు, చొక్కా తడిసిపోయింది.

రవికి పదేళ్లు, ఐదో క్లాసు. వేసవి సెలవులు. క్రికెట్ ఆట మధ్యలో మానేసి ఇంటికి వచ్చాడు. ఎవరూ చూడలేదు. మంచం కింద దాక్కున్నాడు.


అమ్మా అక్కా వంట గదిలో ఉన్నారు. అన్నా, నాన్నా బయటనుంచి రాలేదు.

మంచం కింద రవి బాట్‌ను వాటేసుకున్నాడు. ఈ ఒంటరితనంలో అదే అతడికి అండ.

రవి దాక్కున్నాడు. ఎవరికీ కనబడకూడదు.

ఏడుపు ఆగదు. ఏడిస్తే దొరికిపోతాడు.

ఏడవకుండా ఉండలేడు. ఏడుపు ఆపుకోలేడు. మనిషి ఊగిపోతున్నాడు. ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. నిద్రరాదు. మనసు నిద్రపోదు. శరీరం అలసిపోయింది. కదలకుండా



పడుకున్నాడు. కళ్లు మూతపడలేదు. కన్నీరాగటంలేదు. ముక్కూ, చెక్కిళ్లూ అదురుతున్నాయి. కదలడు. అలికిడి లేదు. ఉక్క.... చెమట.

ఉదయమెప్పుడో ఇడ్లీలు తిన్నాడు. మధ్యాహ్నం అయింది. ఆకలవుతూ ఉంది.

అన్నం పెట్టాలని అమ్మ ఎదురు చూచింది. "ఏడీ వీడు?" అడిగింది. అక్కను వీథిలోకి పంపింది. అక్కకు రవి కనపడలేదు. అమ్మ వాకిట్లో నిలబడి అటూ ఇటూ పారజూస్తూ

ఉంది.

అన్నం తినాలని ఉంది. తింటుంటే కనబడతాడు. కనబడితే పట్టుకుపోతారు.

రవి కళ్లు మూసుకున్నాడు. నోరెత్తలేదు. శబ్దం లేదు.

అమ్మ మళ్లీ అంది - "ఏడీ వీడు?" అమ్మ గొంతులో ఏడుపు దాగి ఉంది. ఆ మాటలు అమ్మ ఏడుపులోంచి పొర్లి, దొర్లి, స్నానం చేసి బయటకు వచ్చాయి.

అక్క చుట్టుపక్కల ఇళ్లలోనూ అడిగి వచ్చింది. రాలేదని చెప్పారు.

తానిక్కడ ఉంటే అక్కడెక్కడ దొరుకుతాడు?

అప్పుడే అన్నా, నాన్నా వచ్చారు. రవి రాలేదని చెబితే "వస్తాళ్లే!" అన్నాడు నాన్న.

అమ్మ అన్నం వడ్డించింది. రెండు మెతుకులు తిన్నాడు. తినబుద్ధి కాలేదు. చేతులు కడుక్కుని లేచాడు. అన్న కూడా సరిగ్గా అన్నం తినలేదు.

రవికి ఆకలిగా ఉంది.

అమ్మతో, అక్కతో మనస్సులోనే చెప్పాడు "మీరు కూడా కొంచెమయినా అన్నం తినండి!'

★ ★ ★

వినబడని రవి మాట వాళ్లు వినలేదు.

"ఎక్కడికి పోయాడు వీడు?" కొంచెం దిగులుగా అడిగాడు నాన్న.

'ఎక్కడికీ పోలేదు నాన్నా! ఇక్కడే ఉన్నాను. నువ్వు సరిగ్గా అన్నం తినలేదు!' అందామనుకున్నాడు. అంటే ఇంకేమన్నా ఉందా? వింటారు. వింటే బైటికి లాగుతారు. నలుగురూ చూస్తారు. నలుగురి కంటబడితే ప్రాణం పోదూ?

రవి నిశ్శబ్దంగా ఏడుస్తున్నాడు. దుఃఖాన్ని కొరికి, నమిలి, మింగుతున్నాడు. ఆకలి తీరటం లేదు. నిశ్శబ్దం.

"ఏం! ఇంత ఆలస్యంగా వచ్చారు?" అమ్మ అడిగింది.

"ఎవరో పాపం స్కూటర్ మీద మించి పడ్డాడు. స్పృహ తప్పలేదు. చావు బతుకుల్లో ఉన్నాడు, హాస్పిటల్లో చేర్చాను. పోలీసులకు చెప్పాను. వాళ్ల వాళ్లకు ఫోను చేయించాను. బైట గాయాల్లేవు. బతుకుతాడన్న ఆశలేదు!" నాన్న చెప్పాడు.

రవి దుఃఖం మింగుతున్నాడు. దాహం తీరటం లేదు.

"పాపం ఎవరో ఆ మనిషి?"

" తెలియదు."

అంతలో అన్న వచ్చాడు. రవితో ఆడుకునే పిల్లలందరి ఇళ్లకు వెళ్లి వచ్చాడు. "రవి ఎక్కడా లేడు. రాలేదని వాళ్లు చెప్పారు. కిరణ్ కూడా ఇంట్లో లేడు. వీళ్లిద్దరే వేపచెట్టుకింద క్రికెట్ ఆడుకుంటూ ఉంది."

రవి విన్నాడు. కదల్లేదు. ఏడుపు ఆగలేదు. 'కిరణ్ కూడా వాళ్లింట్లో మంచం కిందే దాక్కున్నాడు' గొణిగాడు వినిపించదు.

"వీళ్లిద్దరూ ఎక్కడికైనా వెళ్లి ఉంటారా?"

"వెళ్లరు!"

"సినిమాకి?"

"మీతో చెప్పకుండా పోతానా, నాన్నా! ఎప్పుడయినా ఒంటరిగా వెళ్లానా?" అడుగుదామనుకున్నాడు, కానీ మాట రాదే!

నాన్న పడుకోలేదు. కిటికీలోంచి చూస్తున్నాడు. మంచం కిర్రుమంది.

"ఎక్కడికి పోయాడు వీడు?" తనను తానే అడుక్కున్నాడు నాన్న.

ఎవరూ బదులు చెప్పలేదు. అందరూ నిశ్శబ్దంగా ఉన్నారు.

అమ్మా, అక్క అన్నం తినలేదు. అమ్మ తనకు పెట్టకుండా అన్నం తినదు. అక్కా తినదు. తాను తింటే వాళ్లిద్దరూ తింటారు. తాను తినలేడు. బైటికి రాలేడు. ఏడుపు ఆగటం లేదు. ఏడవలేడు. హింస! శబ్దం రారాదు.

అన్న స్కూలుకు కూడా పోయి వచ్చాడు. అక్కడ లేనని చెప్పాడు. మధ్యాహ్నం ఇంటి వైపు ఏడుస్తూ పరుగెత్తుకుని రావటం తాను చూశానని పక్కింటి తాత చెప్పినట్లు అన్న తెలిపాడు.

"వస్తే ఏడీ?" నాన్న అడిగాడు. " ఏం చూశాడో ఏమో!" సందేహించాడు. "అసలే కళ్లు సరిగా కనబడవ్!" తేల్చిపారేశాడు.

"ఇంట్లో ఉంటే కనబడదా?" అమ్మ అంది.

'కనబడను' రవి అనుకున్నాడు.

తండ్రి లేచి బయటికి పోయాడు. అక్క బిక్కుబిక్కుమంటూ కూర్చుంది.

రవికి ఆకలవుతూ ఉంది. దాహం. గొంతెండి పోతూ ఉంది. నాలిక తడారి పోయింది. పిడచకట్టుకు పోతూ ఉంది. నోరు తడిచేసుకుంటూ పడుకున్నాడు. కదల్లేదు.

అక్క ఏడుస్తూ ఉంది. ' ఏడవ్వద్దే!' అందామనుకున్నాడు, కానీ అనలేదు.

అమ్మ ఓదార్చింది. అమ్మ గొంతులో దుఃఖం చెంగుచాటు ముఖంలాగా ఉంది.

అన్న అక్కను కసురుకున్నాడు - "ఏడిశావ్‌లే ఊరుకో!" అన్న మాటను లెక్క పెట్టలేదు. ఏడుస్తూనే ఉంది.

"నువ్వన్నం తినవే?" అంది అమ్మ.

"నువ్వూ?" అమ్మ లేవలేదు. అక్కా లేవలేదు.

"పోయి అన్నం తినండి!" అందామనుకున్నాడు. నేను చచ్చిపోతే వీళ్లంతగా కుమిలిపోతారా అని దిగులుపడ్డాడు.

"చిన్నతండ్రి వస్తాడు. నాన్న తప్పక తీసుకుని వస్తాడు. అందరం కలిసి తిందాం!" అంది అమ్మ.

'నాన్న నన్ను తీసుకురాలేడు. మీరిద్దరూ కలిసి అన్నం తినలేదు. నాలాగే మీరూ పస్తు' రవి గొణుక్కుంటూ ఉన్నాడు.

దాహం. వంటగదిలో కొత్తకుండ. చల్లగా నీళ్లు. కుండనిండా నీళ్లు. కడుపు నిండా తాగవచ్చు కానీ వంట గదిలోకి పోవటానికే తోవలేదు. అక్కడే కూర్చున్నారు వీళ్లు.

వాళ్లకీ కనబడకుండా పోయే వీలు, వచ్చే వీలు లేదు. దాహం, బాధ... నోరు తడిచేసుకుంటూ ఉన్నాడు.

ఎండ తగ్గింది. చీకటి పడింది. ఎక్కడి వాళ్లు అక్కడే కూర్చున్నారు.

నాన్న రాలేదు.

దాహం తీరలేదు. ఆకలి ఆగటం లేదు. దుఃఖం ముంచుకొస్తూ ఉంది. ఏమవుతుందోనని భయం!

అమ్మ లైటు వేసింది. అయినా మంచం కింద చీకటే. రవికి చీకటంటే భయం. రాత్రి ఒంటరిగా పడుకోలేడు. కిటికీలోంచి దెయ్యం వస్తే - ఒంటరిగా పడుకోలేడు. 'కిటికీలోంచి

దెయ్యం వస్తే - ఒంటరిగా ఉన్నవాణ్ణి పట్టుకుంటే - తాను అరవలేకపోతే - ఏడవకపోతే, గట్టిగా నోరు మూసుకుంటే ఏమయినా ఉందా - దెయ్యం పట్టుకునిపోదూ?'

రవి ఊహలకు రెక్కలు వచ్చాయి, ఏడవరాదు. కదలరాదు. అందువల్ల తాను దెయ్యానికి కనబడననుకున్నాడు.

నాన్న వచ్చాడు.

"పోలీసులకు రిపోర్టు ఇచ్చాను. వెతుకుతారు. మన చిన్నతండ్రిని మనకు తెచ్చి అప్పగిస్తారు. భయం లేదు!"

నాన్న గొంతులో భయం తొంగిచూస్తూ ఉంది.

రవికి జ్వరం వచ్చినట్లుంది. కాళ్లూ చేతులూ ఒణుకుతున్నాయి.

"పోలీసులు వస్తారు. పట్టుకుంటారు. తీసుకుపోతారు. జైల్లో పెడతారు. ఉరిశిక్ష వేస్తారు' ' అనుకున్నాడు.

'దొరకను. దాక్కున్నాను' అనుకున్నాడు. 'మాఇంట్లోకి రారు. నన్ను కనుక్కోలేరు' అనీ ఊహించుకున్నాడు.

'పోలీసులకు అన్నీ తెలుస్తాయి. రావటం ఖాయం, పట్టుకుపోవటం ఖాయం' కాళ్లూ చేతులూ ఒణకుతున్నాయి.

"నన్ను చంపుతారు! చంపుతారు!" అని అరిచాడు. అరవలేదనుకున్నాడు. కానీ అరిచాననుకున్నాడు. శబ్దం రాలేదనుకున్నాడు. కానీ శబ్దమయింది.

అమ్మ ఆలకించింది "మంచం కింద ఏమిటా అలికిడి?" అంది. తొంగి చూచింది.

రవి ముణగదీసుకుని పడుకున్నాడు, చీకట్లోనూ రవి ఆకారం తల్లికి కనబడింది.

క్షణంలో మంచంకింద దూరింది. అరక్షణంలో పట్టుకుంది. పావుక్షణంలో బైటికి లాక్కొచ్చింది.

"తండ్రీ!" అంటూ వాటేసుకుని ఏడుస్తూ ఉంది.

ఒణికిపోతున్నాడు. నాన్న వచ్చి జ్వరం చూశాడు. తల నిమిరాడు. అక్క ముక్కు తుడిచింది. మూతి తుడిచింది.

అన్న తమ్ముణ్ని వాటేసుకున్నాడు.

ఇంతసేపూ ఏడుపు ఉగ్గబట్టుకున్న రవి మబ్బుపగిలినట్లు ఏడ్చాడు. అడ్డమాకులు లేకుండా ఏడ్చాడు. కడుపునిండా ఏడ్చాడు. తృప్తిగా ఏడ్చాడు.

అంతలో తెలిసివచ్చింది. తాను ఏడవకూడదు. ఏడిస్తే బైటవాళ్ల వింటారు. వింటే పోలీసులకు చెబుతారు. పట్టిస్తారు. వాళ్లకు తాను ఇంట్లో ఉన్నట్లు తెలియకూడదు.

ఠక్కున ఏడుపు మానేశాడు.

"ఏమయిందిరా?" అంటే ఏమీ చెప్పడు. నిశ్శబ్దంగా కుమిలికుమిలి ఏడుస్తాడు. ఎక్కిళ్ల పెడతాడు మౌనంగా, దిక్కులు చూస్తాడు పిచ్చిగా.

ఏమడిగినా బాధపడుతున్నాడు. ఎవరూ ఏమీ మాట్లాడించటం లేదు.

నీళ్ల తాగాడు. కడుపునిండా తాగాడు చల్లటి నీళ్లు! జ్వరం తగ్గినట్లు ఉంది.

స్నానం చేయించింది అమ్మ. అన్నం తినిపించింది. పొద్దుటి అన్నమే అందరూ తిన్నారు.

"నన్ను పోలీసులు పట్టుకుపోతారా?" తండ్రిని అడిగాడు.

"పట్టుకుపోరు!" నాన్న స్థిరంగా చెప్పాడు.

"మీరు పోలీసులకు నన్ను పట్టిస్తారా?"

"పట్టివ్వం. ఒక వేళ పట్టుకుపోయినా విడిపించి తీసుకొని వస్తాను!" నాన్న ఆలోచిస్తూ చెప్పాడు.

కొడుకు ఎందుకో చాలా భయపడ్డాడని తండ్రి గుర్తించాడు.

రవి నాన్న నడుం పట్టుకుని నిలబడ్డాడు.

'నువ్వు చచ్చిపోతే మేం ఏమవుతాం నాన్నా?'

అమ్మ చెంగు నోట్లో కుక్కుకుంది.

అన్న వచ్చి తమ్ముణ్ని వాటేసుకున్నాడు.

"నేను చచ్చిపోను! మీకే కష్టమూ రాదు."

"పోషించే తండ్రి చచ్చిపోతే పిల్లలు దిక్కులేని వాళ్ల అవుతారు కదా!"

"కారు, భగవంతుడు వాళ్లను చల్లగా చూస్తాడు."

తండ్రి ధైర్యం చెబుతున్నాడు కానీ,సందేహంగా ఉన్నాడు.

దయ, ప్రేమ, వాత్సల్యం తరుముతున్న బాధతో కొడుకు విపరీతంగా ఆందోళన చెందుతున్నాడని తండ్రి అర్థం చేసుకున్నాడు.

పందిరి మంచం మీద కొడుకుని పక్కలో వేసుకుని తండ్రి పడుకున్నాడు.

నేలమీద అమ్మా, అక్కా చాపలు పరుచుకున్నారు. అన్న పరుపేసుకున్నాడు.

తండ్రి నిద్రపోలేదు. కొడుకూ కునుకు తీయలేదు. నాలుగు కళ్లు దీపం బుడ్లలాగా వెలుగుతున్నాయి.

తండ్రి "ఏమయింది నాన్నా?" అన్నాడు.

ప్రేమగా అనునయంగా, ఒళ్లంతా నిమురుతూ.

రవి ఆవురుమని ఏడ్చాడు. ఏమీ చెప్పలేదు.

అపరాధ భావం వల్ల రవికి భయం కలిగింది. ప్రేమ భంగపడుతుందని బాధ కలిగింది. ఒకటి తనను గూర్చి తనకు, మరొకటి లోకాన్ని గూర్చి, రెండూ కలిసి వచ్చాయి. ఏ ఒక్కటో కాదు, రెండూ తీవ్రంగా ఉన్నాయి. పసిపంజరం భావతీవ్రతకు తట్టుకోలేకుండా ఉంది. ఏమీ అడగవద్దు. వాడిష్టం చెబితే చెబుతాడు. లేకపోతే లేదు. తండ్రిని కనిపెట్టి ఉండాలి.

రవి తండ్రిని వాటేసుకుని పడుకున్నాడు. తండ్రి స్పర్శ కొడుక్కు పెద్ద అండ, అభయం, ఓదార్పు,ఊరట, తండ్రికీ కొడుక్కీ మధ్య క్రికెట్ బాట్.

రవి ఒంటికి లేచినప్పుడు అన్న వెంట వచ్చాడు. ఇద్దరూ తిరిగి వస్తున్నప్పుడు "నాన్న చచ్చిపోతే మనమెట్లా బతుకుతామూ?" అన్న ఇంకా నిద్ర మగతలోనే ఉన్నాడు. "నాన్నకేం భయం లేదు!" అన్నాడు. ఆ జవాబు రవికి తృప్తిగా లేదు.

పడుకుంటుంటే "నీళ్లు తాగుతావా?" అని తండ్రి అడిగాడు. రవి 'ఊ' అన్నాడు. తాగాడు.

"నాన్నా!" అన్నాడు రవి.

"ఏం నాన్నా?" పలికాడు తండ్రి.

రవి నిశ్శబ్దంగా ఉన్నాడు. ఉన్నట్టుండి అడిగాడు. "ఎవరైనా, ఎవరినైనా చంపితే, చంపిన వాళ్లకు ఉరిశిక్ష వేస్తారా?"

"ఎవరు చంపారు?"

"అసలు ఊరికినే?"

"ఎవర్ని చంపారు?"

"ఎవర్నీ కాదు - ఊరికినే అడిగాను."

"చంపినట్లు సాక్ష్యముండాలి. చంపటానికి కారణముండాలి."

"సాక్ష్యముంటే?"

"నేరం రుజువు కావాలి?"

"రుజువు అయితే?"

"శిక్ష పడుతుంది."

"ఏం శిక్ష?"

"ఉరి కావచ్చు, జైలు కావచ్చు."

రవి అకస్మాత్తుగా ఏడ్చాడు "నన్ను చంపుతారా?" ఏడుస్తూ అడిగాడు.

"నువ్వెరినైనా చంపావా?"

"లేదు, లేదు. లేదు!" ఏడుస్తూ ఉన్నాడు. "నన్ను పోలీసులకు అప్పగించొద్దు!" ఏడుస్తూనే ఉన్నాడు.

ఏదో ప్రమాదం జరిగిందని ఇంట్లో వాళ్లకు అర్థమయింది. తండ్రి గుండె దిటవు చేసుకున్నాడు. తనకీ ఆశ్చర్యం కలుగుతూ ఉంది. తన కొడుకు అన్ని విషయాలూ చెప్పేవాడు. అన్నీ అడిగేవాడు. తనకు చెప్పకుండా ఏదో దాచేంతగా పెద్దవాడవుతున్నాడు. భయానికీ, బాధకూ మధ్య విపరీతంగా నలిగిపోతున్నాడు. ఈ అనుభవం వాడి జీవితంలో నూత్న అధ్యాయం.

తెల్లవారింది. డైలీ వచ్చింది. హత్యలు, ఆత్మహత్యలు, ప్రమాదాలు, ఆకలి చావులు, కట్నం చావులు, మానభంగాలు పేజీ అంతా చదివాడు.

రవికి సంబంధముండటానికి వీలున్న వార్త ఏదీ కనిపించలేదు.

నాన్న స్నానం చేస్తున్నప్పుడు అన్నను రవి ఏడుస్తూ అడిగాడు.

"తలలో మెదుల్లా, నెమరగంత ఆయువుపట్లు కదా!"

"అవును, నీకెట్లా తెలుసు?"

"మా పుస్తకంలో చదివాను."

"మంచిదే."

"అక్కడే రాయి తగిలితే మనిషి చచ్చిపోతాడు కదా!"

"చెప్పలేం?"

"గట్టిగా తగిలితే!"

"చచ్చిపోవచ్చు."

"క్రికెట్ బాల్ రాయిలాగా ఉంటుంది కదా!'

"ఉంటుంది."

రవి ఏడుస్తున్నాడు. అన్నకు ఏదో అర్థమయినట్లుంది.

రవి ఇంట్లోంచి బైటికి పోలేదు. మంచం మీదే ముసుగేసుకుని పడుకున్నాడు.

"పోలీసులు నన్ను పట్టుకుపోటానికి వస్తే నేనింట్లోలేనని చెప్పండి!" అందర్నీ అర్థించాడు.

కొడుకును చూస్తూ దిగులుగా కూర్చున్నాడు తండ్రి. కళ్లలోంచి నీళ్లు. తాను ఎప్పుడూ కన్నీరు పెట్టిన మనిషి కాదు.

అందరి కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి.

తలుపు కొట్టిన శబ్దం.

"పోలీసులే!" అనుకున్నారంతా

తలుపు తీయలేదు.

మళ్లీ శబ్దం.

తండ్రి కళ్లు తుడుచుకుంటూ వెళ్ళి తలుపు తీశాడు.

ఎదురుగా స్కూటర్ మనిషి.

"హాస్పిటల్ నుంచి పొద్దునే డిస్చార్జి చేశారు. నాకేం కాలేదు. స్పృహ లేనప్పుడు మీరు నన్ను హాస్పిటల్‌లో చేర్చి మేలు చేశారు. లేకపోతే ప్రమాదమే. చచ్చిపోయి ఉండేవాణ్ని. సమయానికి ఆదుకుని నన్ను బతికించారు. నా పిల్లలు దిక్కు లేని వాళ్లు కాకుండా కాపాడారు మీరు!" అంటూ నమస్కరించాడు.

రవి ముసుగు తొలగించి చూశాడు. మనిషి కనిపించాడు. మంచం దిగాడు.

పరుగుపరుగున వచ్చాడు.

స్కూటర్ మనిసి నిలబడ్డచోట స్టూల్ ఉంది. దాన్ని ఎక్కాడు రవి. " అంకుల్!" అన్నాడు.

" ఏం బాబూ?" అన్నాడు స్కూటర్ మనిషి.

రవి అంకుల్ తలంతా ముద్దులతో నింపాడు. తలకు దెబ్బలు లేవు. ముద్దులున్నాయి.

" మీ పిల్లలు దిక్కులేని వాళ్ల కారు. నన్ను పోలీసులు పట్టుకుపోరు!" అన్నాడు రవి. ఏడుస్తున్నాడు. దుఃఖంతో కాదు. బాధతో కాదు. ఆనందంగా ఏడుస్తున్నాడు. కన్నీళ్లతో నవ్వుతూ ఏడుస్తున్నాడు.

అంకుల్ ఓదార్చుతున్నాడు.

"నిన్న మీరేనా, వీథి మొగదల వేపచెట్టుకింద స్కూటర్ మీద పోతూ క్రికెట్ బాల్ తగిలి కిందపడి చచ్చిపోయింది?"

"నేనే! చచ్చిపోలేదు.బతికిపోయాను."

"పోనీలే అంకుల్! బతికించారు!"

క్రికెట్ బాట్ తీసుకుని ఆనందంగా ఏడుస్తూ రవి ఇంట్లోంచి వీథిలోకి పరుగుతీశాడు.

★